ప్రజాశక్తి

శుక్రవారం 27 డిసెంబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

వానొచ్చి..పంట మునిచి..



పొదిలి మండలం అన్నవరం గ్రామంలో నీటిమునిగిన వరి ఓదెలు

- ముసురుతో జిల్లాలో 6,481 హెక్టార్లలో పంట నష్టం
- 75 గ్రామాల్లో నీట మునిగిన పలు పంటలు
- వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలివీ..
- నష్టం ఇంకా పెరిగే అవకాశం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా ముసురు పట్టింది. జల్లుతో కూడిన వాన కొనసాగుతోంది. ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చేతికందే పంటలు నీట మునిగిపోతున్నాయి. రైతులు తల్లడిల్లిపోతున్నారు. కల్లాల్లో మిర్చిని కాపాడు కునేందుకు నానా తంటాలు పడుతున్నారు. పొగాకు రైతులు ఆకుకొట్టి క్యూరింగు చేసే సమయంలో ఈ వర్షాలు తీవ్రంగా నష్టంతో పాటు పనులకు ఆటంకం కలుగుతోంది. బ్యారన్ల వద్ద ఇప్పుడు ఆకు అల్లుతున్నారు. పొగాకు పందిళ్ల ▶ 3లో



త్రిపురాంతకంలో గురువారం తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా


నేడు ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో ఎస్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం ఈ నెల 27న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె .వెంకట మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ జరుగుతుందన్నారు. ప్రత్యేక గ్రీవెన్స్‌ను జిల్లాలోని ఎస్‌టి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌సి కులగణనపై సోషల్ ఆడిట్

8లో ▲



గోపీకృష్ణ, అమూల్య పెళ్లి ఫొటో (ఫైల్)

అత్త వేధింపులు తట్టుకోలేక..

నవ వధువు ఆత్మహత్య

పరారీలో నిందితురాలు

మెయిన్ 3లో ▲



మాట్లాడుతున్న జియోగ్రఫీ శాస్త్రవేత్త శశిధర్

భూప్రకంపనలకు భయపడొద్దు..

- జియోగ్రఫీ శాస్త్రవేత్త శశిధర్
- భూకంపాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని శని, ఆది, సోమవారాలు.. మూడు రోజులు భూప్రకంపనలు వచ్చాయని, ఈ భూప్రకంపనల గురించి ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని సిఎస్ఆర్ఐ జాతీయ జియోగ్రఫీ, హైదరాబాద్ శాస్త్రవేత్త శశిధర్ తెలిపారు. భూప్రకంపనలకు సంబంధించి గురువారం నాడు ముండ్లమూరులోని ఆదర్శ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త శశిధర్ మాట్లాడుతూ 1967లో అద్దంకి ప్రాంతంలో భూకంపం సంభవించిందన్నారు. అద్దంకి జోన్-3లో ఉందన్నారు. అద్దంకిలో భూ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శనివారం వచ్చిన భూకంపం రిక్టర్‌స్కేల్‌పై 3.1గా నమోదయిందని, తరువాత స్వల్పంగా వచ్చిందని చెప్పారు. ఒకసారి భూకంపం వస్తే దాని ప్రభావం కొన్ని రోజులు ఉంటుందన్నారు. ఇటీవల ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో భూకంపాలు వస్తాయన్నారు. చిన్నచిన్న భూకంపాలు సంభవించినప్పుడు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రసన్నలక్ష్మి. శాస్త్రవేత్తలు శశిధర్, సురేష్, విపత్తు నిర్వహణ అధికారి బసంత్‌రెడ్డి. ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకీ ప్రాధాన్యత

- శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు
- రెవెన్యూ సదస్సులో కలెక్టర్ తమీమ్ అన్సారియా



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రెవెన్యూ సదస్సులో వచ్చే ప్రతి అర్జీకీ ప్రాధాన్యత ఇస్తూ శాశ్వత పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్అన్సారియా పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బోడపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సునకు కలెక్టర్ తమీమ్అన్సారియా, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డితో కలసి హాజరై.. భూ సమస్యలపై ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత సమస్యల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల ఆరు నుండి జనవరి 8వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంతో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ సదస్సులో వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి.. వారికి రశీదు ఇస్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులను, సంబంధిత రికార్డులను రెవెన్యూ సదస్సుల వద్ద అందుబాటులో వుంచి తక్షణం పరిష్కరించదగ్గ అర్జీలను పరిష్కరిస్తూ, ▶ 3లో

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని అద్దేపల్లి గ్రామంలోని లూథరన్ చర్చిలో ఫాదర్ మద్దిరాల ఆనందరావు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం, చిన్నపిల్లలచే నాటక ప్రదర్శనలు, క్రీస్తు పాటలకు నత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న సండే స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు అద్దేపల్లి గ్రామానికి చెందిన దాసరి యాసయ్య కుమారుడు దాసరి కిరణ్ బాబు, కోడలు మనోజ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి గ్రామపెద్దలు, స్త్రీల సమాజం సంఘం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళను మోసగించిన కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు గ్రామానికి చెందిన పరిశ రోజా రంగమ్మను ఆర్ఎస్ఐ అని చెప్పి మోసగించి పెళ్లి చేసుకున్న కేసులో నిందితుడు కష్ణాజిల్లా నాగాయలంక మండలం గణపేశ్వరం గ్రామానికి చెందిన మేడిపల్లి పృథ్వీరాజు చౌదరిని కొల్లూరు ఎస్ఐ ఏడుకొండలు అరెస్టు చేశారు. కొల్లూరు బస్టాండ్ సెంటర్ వద్ద ఈనెల 25వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తెనాలి కోర్టులో హాజరపరచగా కోర్టు వారు నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.



బోరును ప్రారంభిస్తున్న సర్పంచి పెద్ద మస్తాన్

నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలోని కేతగుడిపి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను గ్రామ సర్పంచ్ దూదేకుల పెద్ద మస్తాన్ పరిష్కరించారు. గత కొంతకాలంగా కేతగుడిపి గ్రామంలోని బోర్లలో నీరు అడుగంటి పోవడంతో తీవ్ర నీటి సమస్య నెలకొంది. దీంతో గ్రామ ప్రజలు గుక్కెడు నీరు దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలో నీరు వచ్చే ఒక్క బోరు కూడా లేదు. దీంతో స్పందించిన గ్రామ సర్పంచ్ దూదేకుల పెద్ద మస్తాన్ సుమారు కిలోమీటర్లకు పైగా ప్రెజర్ లైన్ వేయించారు. గ్రామంలోని హెడ్ ఓవర్ ట్యాంకుని శుభ్రం చేయించి నీటిని ఎక్కించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కాలంగి శ్రీనివాసులు కలిసి నివాసాల్లోని కొళాయిలకు గురువారం నీటిని సరఫరా చేశారు. గ్రామంలోని నీటి సమస్యకు తక్షణమే పరిష్కారం చూపించారు. నీటి సమస్యను పరిష్కరించడంతో ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ పెద్ద మస్తాన్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రీసర్వే లోపాలను సరిచేయాలి

రెవెన్యూ సదస్సులో అధికారులను కోరిన గ్రామస్తులు

ప్రజాశక్తి -శింగరాయకొండ

రీ సర్వే కారణంగా మూలగుంటపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఆగిపోయిన రిజిస్ట్రేషన్లు మళ్లీ అయ్యే విధంగా చూడాలని గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు గ్రామస్తులు వినతిపత్రాలు అందజేశారు. సచివాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సుకు తహశీల్దార్ టి.రవి అధ్యక్షత వహించగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏ.ఆర్. కుమార్ హాజరయ్యారు. టీడీపీ ఒంగోలు పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సుకు హాజరై రీసర్వే కారణంగా మూలగుంటపాడు గ్రామంలో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని, దీనివలన ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్ని తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. ఈ విషయం జిల్లా అధికారులతో సమస్యను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్ మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన



మాట్లాడుతున్న ఉబ్బా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మద్దిపాడు

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాన్ని తగ్గించాలని సిపిఎం మండల కమిటీ నాయకులు ఉబ్బా వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కీర్తిపాడు గ్రామంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం రూ.15,486 కోట్లు ఛార్జీల రూపంలో భారం మోపిందన్నారు. ప్రజలపై భారాలు వేయటంలో టిడిపి, వైసిపి, బిజెపి పార్టీలన్నీ ఒకటేనన్నారు. విద్యుత్ చార్జీలపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. పాత మీటర్లను తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఇది మీటర్ కాదని స్మార్ట్ బాంబ్ అని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో బురగ శ్రీనివాసరావు, ఎం.ఆంజనేయులు, ఎం.శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపల్లిలో నిరసన

రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు ఉబ్బా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమిత్ షా మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అనంతలక్ష్మి, సరళ, నాగమ్మ, మహిళలు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -శింగరాయకొండ

అర్ధరాత్రి దుకాణాల తాళాలు పగులకొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిఐ హజరత్తయ్య తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 22న కందుకూరు రోడ్డులోని షేక్ ముజీబ్ దుకాణం తాళం పగులకొట్టి చోరీ చేసిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలు పరిశీలించి దొంగతనం చేసిన వ్యక్తిని గుర్తించారు. శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, పద్మనాభపురం గ్రామానికి చెందిన గొల్లంకి ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దుకాణంలో చోరీ చేసిన రూ.5 వేలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మరొక షాపులో రూ.2 వేలు దొంగిలించినట్లు ఒప్పుకోవడంతో అవి కూడా రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు చెడు వ్యసనాలకు బానిసై రాత్రిపూట మద్యం సేవిస్తూ తాళాలు వేసి ఉన్న షాపులను గుర్తించి, తాళాలు పగలగొట్టి నేరాలకు పాల్పడుతుంటారని తెలిపారు. ఇదే తరహాలో వెస్ట్ గోదావరి జిల్లాలోని భీమవరం, బాపట్ల జిల్లాలోని ఈపురుపాలెం, మచిలీపట్నం జిల్లాలోని రుస్తుంబాద వజ్రపు కొత్తూరు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు గుర్తించారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. నిందితుడిని అరెస్టు చేసి కనిగిరి కోర్టుకు హాజరపరిచినట్లు శింగరాయకొండ సిఐ తెలిపారు. కేసు చేధించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతి అర్జీకీ ప్రాధాన్యత

(మొదటిపేజీ తరువాయి)

తక్షణం పరిష్కారం చూపలేనివి నిర్దిష్ట గడువు 45 రోజుల లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బోడపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎక్కువ మ్యూటేషన్ కేసులు వచ్చివున్నాయని, వారందరికీ కూడా ఇప్పుడే మ్యూటేషన్ కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఈ రోజు జరిగిన రెవెన్యూ సదస్సులో సుమారు 80 దరఖాస్తులు రాగా ఏ అర్జీ పరిశీలించినా కొన్ని ఏళ్లగా పరిష్కారం కానీ సమస్యలేనని, వీటిలో సుమారు 95 శాతం సమస్యలకు పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. నిజమైన హక్కుదారునికి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బోడపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం మార్కాపురం మున్సిపల్ పరిధిలోని చెన్నరాయునిపల్లిలోని గహాలు నిర్మిస్తున్న కాలనీని సందర్శించారు. గహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. కలెక్టర్ వెంట మార్కాపురం ఉప కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, మార్కాపురం తహశీల్దార్ కే.చిరంజీవి పాల్గొన్నారు.

వానొచ్చి..పంట ముంచి..

(మొదటిపేజీ తరువాయి)

తడిచిపోతున్నాయి. అన్ని రకాల పైర్లలో కలుపు సమస్య పెరగనుందని రైతులు చెబుతున్నారు. నాలుగు రోజులు పొలాల్లో అడుగుపెట్టకపోతే కలుపు తీవ్రంగా పెరుగుతోంది. గురువారం నాడూ ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. వాతావరణం పూర్తిగా మబ్బుపట్టే ఉంది. ముసురు వానకు పైర్లు మునకేశాయి. నష్టం తప్పలేదు. రైతులకు ఈ సమయంలో కురిసిన వాన ఏ మాత్రం ఉపయోగం లేదు. పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. దిగుబడులపైనా ప్రభావం ఉంటోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో 6,481 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు జేడిఏ శ్రీనివాసరావు వెల్లడించారు. వర్షం వీడనందున ఈ నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉంది. పామూరు, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, ఒంగోలు, కొనకొనమిట్ల, టంగుటూరు మండలాల్లో సుమారు 75 గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. 6,591 మంది రైతులు బాధితులుగా తేలారు. పెట్టుబడులు నీళ్ల పాలయ్యాయి. ప్రధానంగా వరి 566 హెక్టార్లు, మినుము 2206 హెక్టార్లు, శనగ 167 హెక్టార్లు, అలసంద 2950 హెక్టార్లు, పొగాకు 590 హెక్టార్లలో నీటమునిగినట్లు గుర్తించారు. ఇంకా కంది, జొన్న, సజ్జ తదితర పంటలకూ నష్టమే.. మిర్చికీ ఈ వర్షం వల్ల నష్టం తప్పదంటున్నారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-తర్లుపాడు

జనసేన పార్టీ మండల నాయకులు వెలుగు కాశీరావు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలోని అన్ని చర్చిలలోని మహిళలకు చీరలను పంపిణీ చేసేందుకు సహకారాన్ని అందించారు. ఈ చీరలను మార్కాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో లేకపోయినా పలు సేవా కార్యక్రమాలు జనసైనికులతో చేయిస్తూ, పార్టీపై, కార్య కర్తలపై, ప్రజలపై ఇంతటి ఆదరాభిమానాలను చూపు తున్న వెలుగు కాశీరావును అభినందించారు. ఈ కార్య క్రమంలో జనసేన నాయకులు గుంటు రత్నకుమార్, కొండేబోయిన సునీల్, గంజరబోయిన మహేష్, మొవ్వ సురేష్, గుంటు మోషే, ఎఫ్రాన్, బాలరాజు, జాన్, క్రైస్తవు లు పల్లెపోగు ఎబినేజర్, పులుకూరి జాన్ బనియన్, గుంటు నాసరయ్య, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్టూరు

తమ కుమారులు జీవితంలో స్థిర పడలేదనే కారణంతో మనస్థాపానికి గురైన ఓ మహిళ బలవన్మరణానికి ప్రయత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన సంఘటన మార్టూరులో జరిగింది. ఏఎస్ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాల మేరకు.. స్థానిక పాత కో-ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డులో చామర్తి నాగ సరిత (49) భర్త, ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. డిగ్రీలు పూర్తిచేసిన ఇద్దరు కుమారులకు ఎలాంటి ఉద్యోగం రాలేదు. కొడుకులకు ఉద్యోగాలు రాక జీవనోపాధి లేక నాగ సరిత తరచూ బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన ఆమె ఈనెల 17వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన తల్లిని గమనించిన కుమారుడు శ్యామ్ దుర్గా కిరణ్ స్థానికుల సహాయంతో కిందికి దించి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించటంతో నాగసరిత గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు శ్యామ్ దుర్గా కిరణ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు.

స్కూటీ అదుపుతప్పి.. ఏఎస్ఐ మృతి

ప్రజాశక్తి-బాపట్ల




ఏఎస్ఐ కొండయ్య(ఫైల్)

స్కూటీ అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఎఎస్ఐ మృతి చెందాడు. ఈ ఘటన బాపట్ల పట్టణం శృంగార పురంలో గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్న డి.కొండయ్య (61) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... ఎఎస్ఐ కొండయ్య స్కూటీపై వెళ్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వెళ్లే సరికి స్కూటీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. చీరాల పట్టణం పేరాలకు చెందిన కొండయ్య గుంటూరులో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలంలోని దద్దవాడ సమీపంలో అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో రాచర్ల మండలం గుడిమెట్ట గ్రామానికి చెందిన సుంకరి మౌలాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు అంబులెన్స్‌లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద డాగ్ స్క్వాడ్‌తో ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టారు. శింగరాయకొండ సిఐ చావా హజరత్తయ్య, టంగుటూరు ఎస్ఐ నాగమల్లీశ్వరరావు గురువారం తనిఖీలు చేశారు. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలను నిరోధించడానికి నిరంతరం అప్రమత్తతతో టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద డాగ్ స్క్వాడ్‌తో ఆకస్మిక వాహన తనిఖీలు చేసినట్లు వారు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎటువంటి నేరాలు జరుగకుండా అనుమానితులను విచారించడం, గస్తీ తిరగడం వంటివి నిరంతరం చేస్తున్నట్లు తెలిపారు.

సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని..

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- అద్దంకి

గతంలో సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని సిఐటియు నాయకులు పి. తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా కార్మికుల జీవనపరిస్థితులు మారటం లేదని తెలిపారు. కరోనా సమయం, వరదల బీభత్సాలు, అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ కార్మికులు తమ ఆరోగ్యాలను ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించినట్లు తెలిపారు. వారికి ప్రభుత్వాలు సన్మానాలు సత్కారాలు చేయటం తప్ప వారి సేవలకు తగిన విధంగా జీతభత్యాలు ఇవ్వడం లేదని తెలిపారు. గత సంవత్సరం సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు అమలు చేయలేదన్నారు. కనీసం కూటమి ప్రభుత్వమైన ఆ ఒప్పందాలను అమలు చేసి మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగవిరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. ఎవరైనా పారిశుధ్య కార్మికుడు మృతి చెందినప్పుడు మట్టి ఖర్చులు ఇచ్చి వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత రెండు నెలల నుంచి అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. దీంతో వారు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఆదాము, భీష్మ, సామేలు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

నేడు వైసిపి 'పోరుబాట'

ప్రజాశక్తి-బాపట్ల

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు గురువారం తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల నియోజకవర్గ వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కోన రఘుపతి ఛాంబర్ వద్ద నుంచి విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పోరుబాట ర్యాలీలో నియోజకవర్గ పరిధిలోని ప్రజలు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని సుధీర్‌బాబు కోరారు.



ఆర్థిక సాయం అందిస్తున్న జర్నలిస్టు ఫెడరేషన్ సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి -బాపట్ల

చీరాల పట్టణంలోని కారంచేడు ఫ్లైఓవర్‌పై ఈనెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలుడి కుటుంబానికి జై భీమ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూ.11,500 ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. బాపట్ల ఆనంద నగర్‌కు చెందిన ఆరితోటి ప్రవీణ్‌కుమార్ భార్య పిల్లలతో కలిసి చీరాల వెళ్లి క్రిస్మస్ పండుగ సందర్భంగా షాపింగ్ చేసి బైకుపై తిరిగి వస్తున్న క్రమంలో చీరాల పట్టణంలోని కారంచేడు ఫ్లైఓవర్‌పై ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ప్రవీణ్‌కుమార్ ప్రస్తుతం గుంటూరు లలిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబానికి తమ వంతు ఆర్థికసాయాన్ని అందజేసినట్లు జై భీమ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యుడు జంగం దాసు తెలిపారు .

ఎంపీ కృష్ణ ప్రసాద్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి- వేమూరు

వేమూరు,పెనుమర్రు రైల్వే స్టేషన్లల్లో డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్ కల్పించినందుకు బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆళ్ళమూడి ప్రభాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ రేపల్లె, సికింద్రాబాద్ మధ్య నడిచే డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలుకు కరోనా నేపథ్యంలో వేమూరు హాల్ట్ ఎత్తివేసినట్లు తెలిపారు. దీంతో వేమూరు ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఈ విషయం గురించి అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో స్పందించిన ఎంపీ రైల్వే కేంద్ర మంత్రి కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి ప్రజల ఇబ్బందులను గురించి వివరించినట్లు తెలిపారు. స్పందించిన కేంద్ర మంత్రి ఈ నెల 23 నుంచి వేమూరు, పెనుమర్రు స్టేషన్లలో డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్ కల్పించినట్లు తెలిపారు.

అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అమరవీరుల పోరాటాలను, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు పోరాటాలు సాగించాలని సిపిఐ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, బండారు శ్రీనివాసరావు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతోత్సవాలను పురస్కరించుకుని స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద కమ్యూనిస్టు పార్టీ అభిమాని కె. వీరమోహన్‌రావు గురువారం అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ, శ్రీనివాసరావు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్ లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ రైతాంగ, కార్మిక, ఉద్యోగ, పేద ప్రజల కోసం అనేక త్యాగాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వి. శ్రీనివాసరావు, నాగరాజు,దార్సిక్ తదితరులు పాల్గొన్నారు.

నివేశన స్థలం కోసం..

దరఖాస్తు చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

ప్రజాశక్తి -రేపల్లె



బాపట్ల పట్టణంలోని నిరుపేదలు నివేశన స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భూమిలేని నిరుపేదలు నివేశన స్థలాల కోసం సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొం దించినట్లు చెప్పారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో లబ్ధిదారులు సంబంధిత సచివాలయాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంత నిరుపేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంత నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సొంత ఇల్లు లేని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులకు పట్టణ ప్రజలు సహ కరించాలన్నారు. రోడ్లపై చెత్తను వేయరాదని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తారని తెలిపారు. చెత్త సేకరణకు వచ్చినప్పుడు ఇళ్లల్లో ఉన్న వ్యర్థాలను కార్మికులకు అంద జేయాలన్నారు. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచే చర్యల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఎలాంటి అంతరాయం లేకుండా పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.



అమృతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న డిఇఒ

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి - అద్దంకి

జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల న్యాయ పాలనకు వర్చువల్ విధానంలో విచారణ మరియు డిజిటల్ సౌలభ్యం అనే అంశంపై బాపట్లలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో అద్దంకి మండలం చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అద్దంకి అమృత ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో డిఇఒ ఎస్.పురుషోత్తం చేతుల మీదుగా అమృతకు సర్టిఫికెట్, మెమెంటో, రూ. 1500 నగదు అందజేశారు. జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన అమృతను చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు కెవి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు అభినందించారు.

ఆరోగ్య ఉప కేంద్రంలో ఎంపిపి తనిఖీ

ప్రజాశక్తి- భట్టిప్రోలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిపి లలిత కుమారి

మండల పరిధిలోని పెద్దపులివారు ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎంపిపి డివి. లలిత కుమారి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డు లను పరిశీలించారు. అనం తరం విద్యార్థులకు అందజేయాల్సిన ఐరన్ టాబ్లెట్లు, ఆల్బెండజోల్ టాబ్లెట్లను పరిశీలించారు. ప్రతి గురువారం విద్యార్థులకు క్రమం తప్పకుండా అందించి వాటిని సక్రమంగా వారు వినియోగించుకునే విధంగా ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని గ్రామ ప్రజలకు వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య వైద్యులు, వైద్యసిబ్బంది ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - నిజాంపట్నం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిజాంపట్నం కోస్టల్ బ్యాంకు మేనేజర్ విచారపు మురళి తెలిపారు. కోస్టల్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో పిట్టలవాని పాలెం కేర్ హాస్పిటల్ వారి సహకారంతో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజరు మురళి మాట్లాడుతూ కోస్టల్ బ్యాంకు స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే కోస్టల్ బ్యాంకు లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది కె.సైదులు, కె.చంద్ర కుమార్ నాయక్, సగ్రా మస్తాన్, కె.శ్రీధర్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా ఆశయాల సాధనకు కృషి

ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వంగవీటి రంగా ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు పిలుపునిచ్చారు. కాపు సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా 36 వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఒంగోలు రామ్‌నగర్ 1వ లైన్ వద్ద ఉన్న వంగవీటి రంగా విగ్రహానికి ఎమ్మెల్యే దామచర్ల, కాపు సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీని టిడిపి జిల్లా నాయకులు బండారు మదన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ రామ్ నగర్ 10వలైన్, జయరాం హాల్ సెంటర్, కొణిజేడు బస్టాండ్, గద్దలగుంట, సుజాతనగర్, సమతానగర్, కర్నూల్ రోడ్డు, వర్మాహెూటల్ దగ్గర,తులసీరామ్ హాల్ ఎదురు,బండ్ల మిట్ట, కొత్తపట్నం బస్టాండ్, మిరియాల పాలెం సెంటర్ నుండి రామ్ నగర్ వరకు సాగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపి రాష్ట్ర ఎంపిటిసి సంఘ అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్, కాపు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నారపుశెట్టి రామ మోహన్, కాపు సంఘం ప్రధాన కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, కాపు నాయకులు చింతపల్లి నారాయణ, మేకల నారాయణ, లింగిశెట్టి సుబ్బారావు, చెన్నంశెట్టి శివ, బడే విజయ్, పాతాళపు కష్ణమూర్తి, చిట్టెం అంకంబాబు, శ్రీనివాసరావు, నరహరి సాంబయ్య, రాయని సుధాకర్, పగిడి రాములు, అయినా బత్తిన గోపికష్ణ, కుంచాల బాల సుబ్రమణ్యం, శనగల కిరణ్, పాలెం బాబులు, శ్రీపతి పేరయ్య, మిరియాల శ్రీనివాసరావు, మిరియాల వెంకటేశ్వర్లు, లింగిశెట్టి బ్రహ్మ నాయుడు, రావెళ్ళ రాఘవ, రావెళ్ళ ఆంజనేయులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని చింతల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ గ్రామంలో సాగు చేసిన మిరప పంటను, మిరప కళ్లలను సందర్శించారు. గత రెండు రోజుల నుండి కురుస్తున్న అకాల వర్షాలకు పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో విఏఏ పరిపూర్ణ, ఎన్ జిఓ ప్రతినిధి కరుణాకర్, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

29న రెండు వాహనాలకు వేలంపాట

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న రెండు మోటార్ సైకిళ్లకు ఈ నెల 29న ఉదయం 11 గంటలకు యర్రగొండపాలెం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ ఎ.బాలకిషోర్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ పి.చౌడయ్య గురువారం తెలిపారు. కావాల్సిన వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 10 వరకు 17 రోజుల పాటు జరిగిన రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం ఒకటో డివిజన్ మస్టర్ పాయింట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆనాడు జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం దిగివచ్చి నాలుగు సార్లు యూనియన్ నాయకులతో చర్చలు జరిపిన అనంతరం రాత పూర్వకంగా కొన్ని హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. వాటిల్లో కొన్ని మాత్రమే అమలు అయ్యాయని, కొన్ని అమలు కాలేదని చెప్పారు. అమలు కానీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసినందున వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని వివరించారు. ఆప్కాస్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కోవిడ్ కార్మికుల్ని ఆప్కాస్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, స్కూల్ స్వీపర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్మికులకు సేఫ్టీ మెటీరియల్ అందజేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై రాజకీయ కక్ష సాధింపులు, పని భారం పెరిగిందన్నారు. కార్మికులపై రాజకీయ కక్ష సాధింపుల ఆపాలని కోరారు. గతంలో జరిగిన సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో కార్మికులందరినీ ఐక్యం చేసి మరో ఉద్యమానికి సిద్ధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యు రత్నకుమారి, నాగమ్మ, కమల, సిహెచ్ ఆశ్శేశ్వరరావు, రమేష్, బి అరుణ, ఏ కోటమ్మ, కే పద్మ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నేడు విద్యుత్ ఛార్జీల మోతపై నిరసన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచిందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో విమర్శించారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 27న విద్యుత్ చార్జీల పెంపుపై యర్రగొండపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా శుక్రవారం ఉదయం 10 గంటలకు యర్రగొండపాలెంలోని వైసీపీ కార్యాలయానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు భారీగా తరలివచ్చి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

వరి పంట పరిశీలన

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలంలోని ముటుకుల మానేపల్లి, ఐటివరం, చౌటపాచర్ల గ్రామాలలోని రైతులు సాగుచేసిన వరి పంటను మండల వ్యవసాయ అధికారి యల్.మాల్యాద్రి సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. ప్రస్తుతం అల్పపీడన ప్రభావం వలన ఇంకా 2-3 రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతు సోదరులు ఎవరూ వరి కోతలు కోయరాదని, ఒకవేళ ఎవరన్నా వరి కోస్తే కుప్పలను తడవకుండా పట్టలు కప్పుకొని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంట ఏఈఓ వి.గోపికష్ణ, విఏఎలు కొండా నాయక్, వసంతరెడ్డి పాల్గొన్నారు.



డిఎంహెచ్ఒతో మాట్లాడుతున్న సాగర్

స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాను హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత జిల్లాగా రూపొందించటానికి ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని, దానికి తప్పకుండా తన సహాయ సహకారాలు ఉంటాయని డిఎంహెచ్ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ (పి.యూ) హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ యూనిట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి.సాగర్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిఎంహెచ్ఒను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌ని జిల్లాలో జీరో స్థాయికి తీసుకెళ్లటమే ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థల లక్ష్యమని తెలిపారు.

తడిసిన మిర్చి..

- తెల్లకాయలుగా మారతాయని రైతుల ఆందోళన
- నష్టపోయిన వారిని ఆదుకోవాలంటున్న కర్షకులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా యర్రగొండపాలెం ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మిర్చి రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా ఆకాశమంతా మేఘావృతమైంది. బుధవారం రాత్రితో పాటు గురువారం కురిసిన జల్లులతో మిర్చి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండ పాలెం మండలంలో 10,409 ఎకరాలు, పుల్లలచెరువు మండలంలో 8098 ఎకరాలు, త్రిపురాంతకం మండలంలో 5767 ఎకరాలు, పెద్ద దోర్నాల మండలంలో 5817 ఎకరాలు, పెద్దారవీడు మండలంలో 4543 ఎకరాల్లో ఈ ఏడాది మిర్చి పంటను సాగుచేశారు. తోటలకు మాయదారి తెగులు సోకడంతో అధిక ధరలకు మార్కెట్లో దొరికిన కొత్త మందులు అన్ని వాడి తోటలను కాపాడుకున్నారు.



మిర్చిపై కప్పిన పట్టలపై నిలిచిన నీరు



తడిసిన మిర్చి

కళ్లాల్లో తడిసిన మిర్చి..

పది రోజుల క్రితం మిర్చి కోతలు ప్రారంభమయ్యాయి. కాయలు ఆరబెట్టుకునేందుకు రైతులు కల్లాల్లోనే మిర్చిని ఉంచారు. ఊహించని విధంగా వరుసగా అల్పపీడనాల ప్రభావంతో ముసురు పట్టడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షానికి తడిస్తే మిర్చి తోటకు తెగుళ్లతో పాటు కాయ రంగు మారి నాణ్యత తగ్గుతుంది. ధర ఆశించిన స్థాయిలో ఉండదని రైతులు మదనపడుతున్నారు. ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డు మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర 13 వేల రూపాయలు ఉంది. దీంతో రైతులు దళారులకు అమ్మడం లేదా నలుగురు, ఐదుగురు రైతులు కలిపి లారీని బాడుగకు మాట్లాడుకొని గుంటూరు మార్కెట్ యార్డుకు వెళ తున్నారు. ఎకరాకు సుమారు లక్షన్నర రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులకు హఠాత్తుగా కురుస్తున్న వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత రెండు రోజులుగా కళ్లల్లో ఆరబెట్టిన కాయలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. బూజు పట్టాయి. అవి పారేయడం తప్ప ఎందుకూ పనికి రావు. దీనికి తోడు బూజు పట్టకుండా తడిసిన కాయలు సైతం తెల్లగాయలుగా మారే అవకాశం ఉంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

కాయలన్నీ బూజు పట్టాయి..



వడ్డే రంగబాబు, మిర్చి రైతు, కుందంపల్లి

రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశా.. నాలుగు లక్షలు పెట్టుబడి పెట్టా.. తెగుళ్ల బారి నుండి తోటను కాపాడుకున్నా.. మిర్చి తొలి కోత కోశా.. కళ్లంలో ఆర బెట్టా.. కనీసం పది క్వింటాళ్లవుతయాని ఆశపడ్డా... అంతలోనే మాయదారి వర్షం ఆర బెట్టిన మిర్చిని తడిపేసింది. పట్టలు కప్పినా ఉపయోగం లేకుండా పోయింది. కాయలన్నీ బూజు పట్టాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయా..

తెల్ల కాయలుగా మారాయి..

పాశం వెంకట నారాయణ, మిర్చి రైతు, కుందంపల్లి



ఆరు ఎకరాల్లో మిర్చి తోటను వేశా.. తొలి కాపు కోసి కల్లంలో అరబెట్టా.. కురిసిన వర్షంతో కాయలన్నీ తడిచాయి. తొడాలు రాలిపోయాయి. కాయలన్నీ తెల్ల కాయలుగా మారుతున్నాయి. వీటిని యార్డుకు తీసుకెళితే క్వింటా రూ.3 వేలకు కూడా కొనరు. నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.



అన్నదానం దాతలను సత్కరిస్తున్న అయ్యప్ప భక్తులు

కదిరి సహకారంతో అన్నదానం

ప్రజాశక్తి-సిఎస్.పురం

పామూరు పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన అన్నదానంను కదిరి బాబురావు విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కదిరి పార్థసారథి ప్రారంభించారు. ముందుగా అయ్యప్పస్వామి, అన్నపూర్ణేశ్వరిని దర్శించుకున్నారు. దేవస్థానం అధ్యక్షులు గుత్తి రాజా, కదిరి పార్థసారథిని పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కదిరి రమణయ్య, కదిరి రాంబాబు, పట్నం తిరుపతయ్య, షేక్ నాయబ్‌రసూల్, రామకృష్ణ, నాగం పవన్ పాల్గొన్నారు.

కళాశాల విద్యపై ప్రయోగాలేల.?

ప్రజాశక్తి-సిఎస్.పురం

కళాశాల విద్యపై ప్రభుత్వం ప్రయోగాలు చేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంటర్ విద్యను దూరం చేయవద్దని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యదర్శి నారిశెట్టి వెంకటరామయ్య, షేక్ పాదుష, అరియారం సురేష్ ప్రభుత్వానికి హితవు పలికారు. హైస్కూల్ ప్లస్‌లను రద్దు చేస్తామని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని, వాటి స్థానంలో జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి జడ్‌పి ఉపాధ్యాయులకు జెఎల్‌గా పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటు చేసే కళాశాలలకు అవసరమైన సైన్సు ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కళాశాల విద్య అందుబాటులో ఉంచాలని కోరారు. 223 జిఒను రద్దు చేసి, 302 జిఒ ఆధారంగా అర్హత గల ప్రభుత్వ, పంచాయతీరాజ్ స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జెఎల్‌గా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్‌సిటిఇ నిబంధనలకు విరుద్ధంగా భోదనేతర సిబ్బందికి జెఎల్‌గా పదోన్నతులు ఇవ్వడం అత్యంత బాధాకరమన్నారు. కళాశాల విద్యపై అస్పష్ట ప్రకటనలతో ప్రభావం రాబోయే విద్యా సంవత్సరం ఇంటర్ అడ్మిషన్లపై పడుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కళాశాల విద్యపై స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ విద్యను బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

28న సమావేశం

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఈ నెల 28న స్థానిక మెయిన్‌స్కూల్లో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో టిఐఎస్, ఇన్కమ్ టాక్స్ ఫారాల భర్తీపై సమావేశం జరుగుతుందని ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెఎస్ ఆనంద్‌బాబు తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు అత్యవసరమైన టిఐఎస్ ఫారాలపై శిక్షణ, ఇన్కమ్‌టాక్స్ ఫారాలపై శిక్షణ జరుగుతుందన్నారు. కావున ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు ఉపయోగించుకుని తమ టీఐఎస్ పార్మ్ ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేసి బదిలీలు, ప్రమోషన్‌లలో ఇబ్బంది లేకుండా చేసుకోవాలన్నారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ హాజరవుతారని తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని అయ్యాలూరివారిపల్లిలో ధ్వజస్తంభ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలోని వినాయకగుడి వద్ద జరిగిన ధ్వజస్తంబ కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైసిపి నాయకులు చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముత్యాల భారతి, నారాయణరెడ్డి, భూమిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అటవీ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఒ కేశవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

అటవీ అధికారుల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతునట్లు మండలంలోని వెంకటాయ చెరువు గ్రామ రైతులు కనిగిరి ఆర్‌డిఒ కేశవర్ధనరెడ్డి దృష్టికి తెచ్చారు. అటవీ శాఖ భూములకు హద్దులు ఏర్పాటు చేయించి ఇబ్బందులు తీర్చాలని గ్రామానికి చెందిన రైతులు, పశు పోషకులు వేడుకున్నారు. గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తాము గొర్రెలు, పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే తమ జీవాలు ఎటువైపుకు వెళ్లినా ఆ పొలం తమకు సంబంధించినదని, తమ భూమిలోకి గొర్రెలు వచ్చాయంటూ అటవీ శాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నట్లు వాపోయారు. సదస్సులో ప్రజల నుంచి 18 అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు డి మంజునాథరెడ్డి తెలిపారు. టిడిపి అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, ఎన్‌సి మాలకొండయ్య, మండల సర్వేయర్ బ్రహ్మానందరెడ్డి, వీఆర్ఒ యు మాలకొండయ్య, సచివాలయ సర్వే గురుబ్రహ్మం, గ్రామస్తులు కోనంకి వెంకట కొండయ్య, సీతారామయ్య పాల్గొన్నారు.

పామూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎఎంసి చైర్మన్ యారవ శ్రీనివాసులు కోరారు. మండలంలోని బొట్లగుండూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. టిడిపి ప్రభుత్వాం ప్రజల వద్ద పాలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తహశీల్దారు బివి రమణారావు మాట్లాడుతూ సమస్యలు ఉంటే అర్జీ ద్వారా తెలపాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, నరసింహారావు రైతులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ఉద్దేశమని తహశీల్దార్ ఆవులసురేష్ అన్నారు. మండలంలోని చింతకుంట్లలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకుంటే పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. సదస్సులో తొమ్మిది దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎస్సీ కాలనీలో రెవిన్యూ సిబ్బంది, నాయకులు పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మాధవరెడ్డి, సర్వేయర్ రాజశేఖర్, విఆర్ఓలు ఎం రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, నరసారెడ్డి, సచివాలయ సర్వేయర్లు, నాయకులు వేల్పుల తిరుపతయ్య, నారాయణరెడ్డి, రాగి పాపయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు చెన్నయ్య, పి వినోద్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కెకెమిట్ల తహశీల్దారు ఆవుల సురేష్



అర్జీలు స్వీకరిస్తున్న పామూరు తహశీల్దార్దు బివి రమణారావు

1న నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో జనవరి 1న దర్శనాపురి వనిత, వాసవి క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు వనిత, వాసవి క్లబ్ నూతన అధ్యక్షురాలు దేసు సంధ్యారాణి గురువారం తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవం మునగా ఆంజనేయులు, మునగా నీలిమ, రీజియన్ సెక్రెటరీ కొల్ల సుజాత, జోన్‌చైర్మన్ మునగా లక్ష్మీ కుమారి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. వాసవి కన్యక పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆహ్వానం పత్రికలను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో దర్శనాపురి వనిత వాసవి క్లబ్ నూతన అధ్యక్షురాలు దేసు సంధ్యారాణి, నూతన ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి సుశీల, కోశాధికారిగా తెల్లాకుల సత్యలక్ష్మిల పదవీ ప్రమాణ స్వీకారం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జబర్దస్త్ టీం, వంటలక్క మోహన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ మహిళా సంఘం నాయకులు, కొల్లూరి సుశీల, తెల్లాకుల సత్యలక్ష్మి, పోలేపల్లి సౌజన్య, పువ్వాడ అరుణకుమారి, మహేశ్వరి, అచ్యుతలక్ష్మీ ప్రసన్న, సూరె పద్మావతి, కట్టమూరి ఈశ్వరి, తల్లం సత్యవతి, మునగా మహాలక్ష్మి పాల్గొన్నారు.




ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మహిళా నాయకులు

రోడ్డు ప్రమాదంలో లాయర్ మృతి

ప్రజాశక్తి - కురిచేడు

ఈ నెల 23న సాయంత్రం 7 గంటల సమయంలో నూజెండ్ల మండలం మృత్యుంజయ పురం గ్రామానికి చెందిన పాల వాహనం యోగిరెడ్డి పాలెం సమీపంలో కురిచేడు గ్రామానికి చెందిన లాయర్ ఉప్పలపాటి దుర్గారావు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో దుర్గారావుకి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో లాయర్ దుర్గారావు కుడికాలు నుజ్జు నుజ్జు కాగా పక్కటెముకలు విరిగి అతని కాలేయమునకు తగిలి గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 అంబులెన్స్ ద్వారా వినుకొండ తరలించగా ఒకరోజు వైద్యం అందించి పరిస్థితి విషమించడంతో గుంటూరు తరలించారు. గుంటూరు హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతి చెందినట్లు ఆయన బంధువులు తెలిపారు.



దుర్గారావు (ఫైల్‌ఫోటో)

కష్టపడి చదివి ర్యాంకులు సాధించాలి

ఎఎంసి చైర్మన్ యావవ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పామూరు

విద్యార్థులు కష్టపడి చదివి ర్యాంకులు సంపాదించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావలని ఎఎంసి చైర్మన్ యారం శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలు దీటుగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులు ర్యాంకులు సంపాదించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్మెంట్ ఉద్యోగి సాల్మన్ రాజ్, నాయబ్ రసూల్, ప్రిన్సిపాల్, టీచర్స్ పాల్గొన్నారు.



మెటీరియల్ అందజేస్తున్న యారం శ్రీనివాసరావు



స్వామిని దర్శించుకున్న చింతలచెరువు దంపతులు

భైరవకోనలో వైసిపి నేత 'చింతలచెరువు' పూజలు

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రం భైరవకోనలో త్రిముఖదేవిని ఆంధ్ర ప్రదేశ్‌రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. భైరవకోన విచ్చేసిన ఆయన అక్కడ జలపాతం, త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల దర్శనం చేసుకున్నారు. ఆలయ పూజారులు సత్యనారాయణరెడ్డి దంపతులను స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సిద్ధి వెంకటరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, తమ్మినేని ఫణింద్రరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతి

ప్రజాశక్తి - పొదిలి

మండలంలోని పొదిలి పంచాయతీలోని రాజుపాలెంలో విద్యుత్ షాక్‌తో రెండు గేదలు గురువారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కీర్తి ప్రసాద్, కంచర్ల నాగేశ్వరరావుకు చెందిన రెండు గేదలు మేత కోసం వెళ్లి సమీప పొలంలో వ్యవసాయ విద్యుత్ మోటార్‌కు వేసిన తీగలు తగిలి షాక్ తగిలి మృతి చెందాయి. వ్యవసాయ మోటార్‌కు వేసిన తీగలు కిందుగా ఉండడం, వాటికి విద్యుత్ ప్రవహించి గేదెల మృతి చెందిన ఘటనపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుల, విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. చనిపోయిన గేదలకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



మృతి చెందిన గేదెలు

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కారంచేడు

మండల పరిధిలోని పోతినవారిపాలెం, తిమ్మిడితపాడు రైతు సేవా కేంద్రాల వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సుధీర్‌బాబు మాట్లాడుతూ రైతులకు పంట దిగుబడది ఆధారంగా పంటల బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత రబీ సీజన్ నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 31 వరకూ అవకాశం ఉన్నట్లు తెలిపారు. శనగ పంటకు ఎకరానికి రూ84. వరికి రూ.126, మినుముకు రూ.60, పెసరకు రూ.36, మొక్క జొన్నకు రూ.105, జొన్నకు రూ.38, వేరుశనగకు రూ.90 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎటిఎం హారిక , విఎఎ వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

కర్లపాలెం : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 31లోపు పంట బీమా ప్రీమియం చెల్లించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ లక్ష్మీ తెలిపారు. మండల పరిధిలోని పేరలి, గణపవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు పంటల బీమా ప్రీమియం బ్యాంకుల ద్వారా ఈనెల ఆఖరు లోపు చెల్లించాలన్నారు. అర్హులైన కౌలు రైతులను వ్యవసాయ సిబ్బంది గుర్తించి వారికి వ్యవసాయ రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ సుమంత్ కుమార్, విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయసహాయకుడు తిరుమలేష్,రైతులు పాల్గొన్నారు.



కారంచేడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



కర్లపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమృతలూరు : మండల పరిధిలోని పాంచాలవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ శ్రీకాంత్ మాట్లాడుతూ పంటల సాగు తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు సూచనలు చేశారు. మినుము ,పెసర పంటలు సాగు చేస్తే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలన్నారు. రబీలోపంటలు సాగు చేసిన రైతులు ఈనెల 31లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని జాగ్రత్తగా భద్ర పరుచుకోవాలని ఎఒ కొర్రపాటి వెంకటకష్ణ తెలిపారు. అద్దంకి అర్బన్ ప్రాంతంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలుత వర్షాలకు తడిసిన వరి ఓదెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ తక్కువ వర్షపాతం నమోదైనందున వరి పంట దెబ్బతినలేదని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటా మద్దతు ధర రూ. 2,320 ఇస్తున్నట్లు తెలిపారు. ధాన్యంలో తేమ శాతం 17 లోపు ఉండేటట్లు చూసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి బాబు, కోటేశ్వరరావు, శేషారావు, చింతా వెంకటేశ్వర రెడ్డి, రైతులు పాల్గొన్నారు



అద్దంకిలో వరి ఓదెలను పరిశీలిస్తున్న అధికారులు

సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- వేమూరు

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన నగదును బాధితురాలికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా గురువారం అందజేశారు. మండల పరిధిలోని చిన్నపరిమి గ్రామానికి చెందిన కట్టుపల్లి రజనీకి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.7లక్షల మంజూరయ్యాయి. బాధితురాలు రజనీకి రూ.7 లక్షల చెక్కును ఎమ్మెల్యే ఆనందబాబు తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న అల్లంశెట్టి నరేష్ బాబు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -రేపల్లె

ఆపదలో ఉన్న వారికి సహాయ, సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని జనసేన పార్టీ నాయకుడు, జర్నలిస్ట్ అల్లంశెట్టి నరేష్ బాబు అన్నారు. రేపల్లె మండలం ఉప్పూడి పంచాయతీ పరిధిలోని ఊలుపాలెం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దోనేపూడి మోహనరావు కుటుంబసభ్యులను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా నరేష్ బాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో మోహన్‌రావుకు చెందిన పూరి ఇల్లు పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. దీంతో మోహనరావు కుటుంబ సభ్యులు కట్టు బట్టలతో మిగిలినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మోహనరావు కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు.



చెక్కు అందజేస్తున్న మాధురి

డ్వాక్రా గ్రూపులకు రుణాలు అందజేత

ప్రజాశక్తి - కర్లపాలెం

మహిళల ఆర్థికాభివద్ధి, మహిళా సంఘాల జీవనోపాదుల పెంపుదలే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యమని రీజనల్ హెడ్ టి.మాధురి తెలిపారు. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో డ్వాక్రా గ్రూపులకు జీవనోపాదుల రుణాలు నిమిత్తం గురువారం రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ నేటి ఆర్థికరంగంలో ప్రభుత్వం యొక్క ఆశయాల మేరకు ప్రతి మహిళా లక్షాధికారి కావాలని సంకల్పంతో బ్యాంకుల ద్వారా అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి డ్వాక్రా గ్రూపు రూ. 20 లక్షల రుణం అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి మళ్లీ అధిక మొత్తంలో రుణాలు పొందే అవకాశాన్నిఅందిపుచ్చుకోవాలన్నారు. రుణాలతో వ్యాపారాలు నిర్వహించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తే కుటుంబానికి అండగా ఉండవచ్చునని తెలిపారు. రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించి వారి కుటుంబాలకు అండగా నిలవాలని ఆయ కోరారు. అనంతరం డ్వాక్రా మహిళలకు ఐదు కోట్లు రుణాలు, కోటి రూపాయలు లఘుపతి ధీధీ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కె. మానస,డిప్యూటీ మేనేజర్ భాను ఫణీంద్ర, ఎపిఎం శ్రీనివాస రెడ్డి, సిసి రాఘవ, శివ కుమారి, కోటేశ్వరరావు, ఆర్డీఓ మనోజ్, సిబ్బంది అనీషా, సుష్మ, జగదీష్, రాజమోహన్ రెడ్డి, గోపి, జనక మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి

.ప్రజాశక్తి-బాపట్ల

పేద,బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పరితపిస్తూ అశువులు బాసిన గొప్ప నాయకుడు వంగవీటి మోహన రంగా అని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎంపిటిసి తాండ్ర సాంబశివరావు తెలిపారు. వంగవీటి మోహన రంగా 36 వ వర్ధంతి సందర్భంగా బాపట్ల పట్టణంలోని భీమవారిపాలెంలోకాపు సంఘం నాయకులతో కలిసి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, ఆలపర్తి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది భీమా లీలా కష్ణా, కోటికలపూడి సురేష్, ఎన్‌జిఒ నాయకులు రాయుడు, ఇమ్మడి శెట్టి శ్రీనివాసరావు, భీమా వేంకటేశ్వరరావు, అంజనేశ్, సురేంద్ర, తోట కృష్ణ పాల్గొన్నారు.

నిజాంపట్నం : మండలలోని కూచినపూడి గ్రామం లో వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్ కాపు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహానికి కాపు నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. పూలమాలులు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొలసాని కోటేశ్వరావు మాస్టారు, తోట వెంకట రామారావు, గాదె శ్రీనివాసరావు, నల్లపాటి ఎల్లయ్య, బేతపూడి రామారావు, అన్నపురెడ్డి పున్నారావు, గాదె శ్రీను, తోట రమేష్, అన్నపురెడ్డి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : మండల పరిధిలోని చెరుకుపల్లి కొత్తపేట, ఊచవారిపాలెం, తూర్పు పాలెం గ్రామాల్లో వంగవీటి మోహనరంగా వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయా కార్యక్రమాల్లో జనసేనపార్టీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ మత్తి భాస్కరరావు, చిరంజీవి యువత నాయకులు కోట్రా నాంచారయ్య, లోయ శ్రీనివాసరావు, ఎల్లెల రవికిరణ్ , అవ్వారు రామారావు, కొత్ర రమేష్, హనుమంత రావు, పూల సాంబయ్య పాల్గొన్నారు.



బాపట్లలో నివాళులర్పిస్తున్న నాయకులు


రేపల్లె : వంగవీటి మోహన రంగా ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తి దాయకమని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టి మహేష్ తెలిపారు. జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి నేతల ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి నిర్వహిం చారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పట్టాభి రామారావు, బిజెపి నాయకుడు రామరాజు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో

వైసిపి ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రేపల్లె పాతటౌన్ వద్ద ఉన్న రంగా విగ్రహానికి వైసిపి పట్టణ అధ్యక్షుడు గడ్డం రాధాకష్ణమూర్తి, వైసిపి వార్డు కౌన్సిలర్ బండి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిజాం పట్నంలో నివాళులర్పిస్తున్న నాయకులు



రేపల్లెలో నివాళులర్పిస్తున్న నాయకులు



ఎస్ఐతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

కార్యకర్తల జోలికొస్తే ఊరుకొనేది లేదు

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అశోక్‌బాబు

ప్రజాశక్తి-చుండూరు

కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని వైసిపి కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని వైసిపి వేమూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు ఆరోపించారు. మండల పరిధిలోని దుండిపాలెం గ్రామంలో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. పోలీసులు విచారణ పేరుతో వైసిపి చెందిన ఏడుగురు కార్యకర్తలను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. తాము ఫ్లెక్సీలు చించలేదని బాధితులు వాపోయారు. అయినప్పటికీ పోలీసులు విచారణ పేరుతో వారిని పోలీస్ స్టేషన్‌లోనే ఉంచారు. ఈ విషయం గురించి తెలుసుకున్న వరికూటి అశోక్‌బాబు పోలీసుస్టేషన్‌కు వచ్చి ఎస్ఐతో మాట్లాడారు. ఫ్లెక్సీలు చించివేసిన ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకుండానే వైసిపి కార్యకర్తలను ఎందుకు పోలీసుస్టేషన్‌కు తీకొచ్చారని ప్రశ్నించారు. అనంతరం పోలీసులు వైసిపి కార్యకర్తలను విడిపించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ వైసిపి కార్యకర్తల జోలికొస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. తాను కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు.

ఎస్‌సి కులగణనపై సోషల్ ఆడిట్

- 31 లోపు అభ్యంతరాలు తెలియజేయాలి
- 10న సచివాలయాల్లో ప్రదర్శన
- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి వర్గీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్‌సిల జనాభా, వారి వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్‌సి కులగణన వివరాలను ఈ నెల 26 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నారన్నారు. ప్రకాశం జిల్లాలోని ఎస్‌సి పౌరులకు వీటిపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 26 నుంచి 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో సమర్పించాలన్నారు. తరువాత 2025 జనవరి 6 వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం 2025న జనవరి 10న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు. ఈ మేరకు జిల్లాలకు రాష్ట్రప్రభుత్వం మార్గ దర్శకాలను విడుదల చేసిందని కలెక్టర్ తెలిపారు.

మూడు దశలలో తనిఖీ

పేరు, ఆధార్ నెంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వత్తి, వ్యవసాయం, ఇతర వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ డేటాపై అభ్యంతరాలను సచివాలయంలో విఆర్‌ఒ స్వీకరిస్తారని, వీటిని మూడు దశల్లో తనిఖీ చేస్తారన్నారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను విఆర్‌ఒ పరిశీలించి వివరాలను మండల ఆర్‌ఐకి నివేదిస్తారన్నారు. వీటిని మండల ఆర్‌ఐ పున:పరిశీలించి మండల తహాశీల్దారుకు సిఫారసు చేస్తారన్నారు. తర్వాత తహాశీల్దారు విఆర్‌ఒ, ఆర్‌ఐల నివేదికను పోర్టల్‌లో పొందుపరుస్తారు. పొందుపరిచిన వివరాల్లో ఖచ్చితత్వాన్ని పెంపొందించేందుకు జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాల్ని ర్యాండమ్‌గా తనిఖీ చేస్తారన్నారు. ఈ సోషల్ ఆడిట్‌ను తాను, ఆర్డీవోలు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి సహకారంతో పర్యవేక్షిస్తామన్నారు. ప్రకాశం జిల్లాలోని ఎస్‌సి పౌరులందరూ ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకొని సహకరించాలని కలెక్టర్ కోరారు.

పోరాటాల ద్వారా దేశాభివృద్ధిలో కీలకపాత్ర

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య
- ఘనంగా శత జయంతి ఉత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పోరాటాల ద్వారా దేశాభివృద్ధిలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సిపిఐ శతజయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత సిపిఐ రాష్ట్ర నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యఅతిథిగా గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సిపిఐ శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. దేశంలోని 28 రాష్ట్రాలలోని లక్షలాది గ్రామాలలో ఎర్రజెండా వంద సంవత్సరాల పండుగ జరుపుకుంటున్నారన్నారు. సిపిఐకు 100 సంవత్సరాల వీరోచిత పోరాటాల చరిత్ర ఉందని, యువకులు, విద్యార్థులు, కళాకారులు, రచయితలు, మేధావుల అన్ని వర్గాల ప్రజల పక్షాన నిలిచి అనేక పోరాటాలు చేసిందన్నారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, జమీందారు వ్యవస్థకు, జాగీర్‌దారీ వ్యవస్థకు వ్యతిరేకంగా నిలిచి అనేక పోరాటాలు చేసిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ, సిపిఐ రాష్ట్ర నాయకులు పిజె చంద్రశేఖర్ మాట్లాడుతూ సోషలిజం, సమ సమాజం కోసం పోరాటాలకు పునరంకితం అవుతూ రానున్న కాలంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సిపిఐ రాష్ట్ర నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ దున్నేవాడికే భూమి దక్కాలని దేశంలో సిపిఐ తొలిసారి నినాదం చేసిందన్నారు. అనేక పోరాటాల ద్వారా లక్షలాది మంది పేదలకు భూ పంపిణీ చేసిన పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ సిపిఐ శత జయంతి ఉత్సవాలు ఏడాది పాటు నిర్వహిస్తామని తెలిపారు. జాతీయస్థాయిలో ముగింపు సభలను తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎం.వెంకయ్య, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసులు, సీనియర్ అడ్వకేట్ ముదివర్తి రాఘవరావు,, నాయకులు కారుమూడి నాగేశ్వరరావు, కె.అంజయ్య, ఎంఏ సలార్, సిహెచ్ వెంకటేశ్వర్లు, శుభాన్ నాయుడు, ఎస్‌డి సర్దార్ పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఒను కలిసిన యుఎంహెచ్‌ఈయు నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


డిఎంహెచ్‌ఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ తెలగతోటి వెంకటేశ్వర్లును యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో ఆయనను కలసిన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.సురేష్, కె.శ్రీధర్ బాబులు, యూనియన్ జిల్లా కోశాధికారి జి.నాగేశ్వర రావు, పి.మోహనరావు, సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షుడు నాయకులు కాలం సుబ్బారావు, ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ పుష్ప గుచ్ఛమిచ్చి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించేందుకు మా అభిప్రాయాలు తీసుకోలేదు..

జేసీకి షాపుల యజమానుల ఫిర్యాదు

ప్రజాశక్తి-బేస్తవారిపేట


జేసీతో మాట్లాడుతున్న షాపుల యజమానులు

నేషనల్ హైవే అధికారులు స్థానిక షాపుల యజమానుల అభిప్రాయాలు తీసుకోకుండా వాళ్ల ఇష్టానుసారంగా రోడ్డు నిర్మాణం చేపట్టారని షాపుల యజమానులు జేసీ గోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. బేస్తవారిపేట పట్టణంలో జాతీయ రహదారి వెంట అసంపూర్తిగా నిర్మించిన సర్వీస్ రోడ్లను జేసీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సర్వీస్ రోడ్డు వెంట ఉన్న షాపులు యజమానులు జెసికి వినతిపత్రం అందజేశారు. గతంలో 30 మీటర్లుగా రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారని, 25 మీటర్లు రోడ్డు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ విషయంపై స్థానిక నేషనల్ హైవే అధికారులను పిలిపించి జేసీ మాట్లాడారు. అనంతరం పాత ఎఫ్ఎంబీ ప్రకారం సర్వే చేసి మార్కింగ్ ఇవ్వాలని, నివేదికను తయారు చేసి.. అందజేయాలని స్థానిక తహశీల్దార్ ఏ.జితేంద్రకుమార్‌ను ఆదేశించారు. సర్వే నివేదిక అందిన తర్వాత షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సర్వే చేసే అధికారులకు ఆటంకం కలిగించవద్దని యజమానులకు సూచించారు. నివేదిక అందిన వెంటనే సంక్రాంతి తర్వాత దుకాణ యజమానులు అభిప్రాయాలు తీసుకొని ఏం చేయాలో ఎలా చేయాలో నిర్ణయిస్తామన్నారు. అనంతరం తేరు బజారులో ఓ వ్యక్తి రోడ్డు ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని కొందరు మహిళలు జేసీకి వినతిపత్రం అందజేశారు. వినతి పత్రాన్ని పరిశీలించిన జేసీ సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈయన వెంట నేషనల్ హైవే అధికారులు ఉన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

కలెక్టర్ తమీమ్‌అన్సారియా


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

గ్రామస్థాయిలో భూ సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందని, ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా పేర్కొన్నారు. గురువారం త్రిపురాంతకం మండలంలోని ఎండూరివారిపాలెం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరై వివిధ సమస్యలపై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీల వారీగా పరిశీలన చేసి, పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూ సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు సంబంధించిన భూ సంబంధ సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకొని.. పరిష్కారం అయ్యే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీకి ఎండార్స్మెంట్ ఇవ్వడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వరి, మిర్చి, మొక్క జొన్న పంట దెబ్బతిందని, ఆదుకోవాలని రైతులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ వెంటనే దెబ్బతిన్న వరి, మిర్చి, మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జి ఎరిక్షన్ బాబు, వ్యవసాయ అధికారిని నీరజ, ఆర్‌ఐ ముకుంద హరి, డాక్టర్ కరున్ కుమార్,ఏఓ వరప్రసాద్, విస్తరణ అధికారి రామ సుబ్బయ్య, తెలుగుదేశం నాయకులు చలమయ్య, ఆళ్ళ నాసర రెడ్డి, కన్వీనర్ వలరాజ్, గుత్త వెంకట నారాయణ, మల్లెల అల్లూరి రెడ్డి, కటికి కొండలు, సునీల్, చంటి పాల్గొన్నారు.

రంగాకు కులాన్ని ఆపాదించొద్దు

- ఎమ్మెల్యే ఏలూరి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా - సోపిరాలలో రంగా కాంస్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-చినగంజాం, వేటపాలెం


రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాధా, ఏలూరి

వంగవీటి మోహన రంగా ఒక కులానికి సంబంధించిన వ్యక్తి కాదని, ఆయనకు కులాన్ని ఆపాదించొద్దని, అన్ని వర్గాల ప్రజల మదిలో నిలిచారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా పేర్కొన్నారు. చినగంజాం గ్రామంలో సోపిరాలలో నూతనంగా ఏర్పాటుచేసిన వంగవీటి మోహన రంగా పది అడుగుల కాంస్య విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా వంగవీటి రాధా, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విచ్చేశారు. తొలుత గ్రామ శివారులో ఎమ్మెల్యే ఏలూరి, వంగవీటి రాధాకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. భారీ స్థాయిలో ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటుచేసిన వంగవీటి మోహన రంగా కాంస్య విగ్రహాన్ని వంగవీటి రాధా, ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. అనంతరం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ టిఎస్‌ఆర్ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో వంగవీటి రంగా మాట్లాడుతూ తన తండ్రిని కులమతాల కతీతంగా ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. వంగవీటి రంగా ప్రజలకు దూరమై మూడున్నర దశాబ్దాలు దాటినా కూడా నేటికీ రాష్ట్రం నలుమూలలా రంగా పేరుతో కార్యక్రమాలు చేయడం, అన్ని వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలే కారణమన్నారు. మీ అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. రంగా విగ్రహావిష్కరణకు కషి చేసిన ఎమ్మెల్యే ఏలూరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రంగా అంటేనే పోరాటానికి దిక్సూచి అని, పేదల పాలిట పెన్నిధి అని పేర్కొన్నారు. రంగా ఒక కులానికి సంబంధించిన వ్యక్తి కాదని, అన్ని వర్గాల ప్రజల మదిలో నిలిచారన్నారు. వంగవీటి మోహన రంగా కుల, మతాలకతీతంగా పేదల కోసం అండగా నిలిచారన్నారు. రంగా తనయుడిగా రాధాకష్ణ తండ్రి ఆశయాల కోసం పని చేస్తున్నారన్నారు. రాధ చాలా సౌమ్యుడని, ఏదీ ఆశించకుండా ఆయన తండ్రి పేరు ప్రఖ్యాతలను పెంపొందించేలా రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రాధాకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని, పదిమందికి ఉపయోగపడాలంటే రాజకీయ నేపథ్యంలోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా కేబిటి కన్వీనర్ దాసరి రాము, కాపునాడు జాతీయ అధ్యక్షులు గల్లా సుబ్రహ్మణ్యం, గాదె వెంకటేశ్వరరావు, ఆకుల తిరుమలరావు, ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన నేత ఆమంచి స్వాములు, పొగడ దండ రవికుమార్, గోపాలకష్ణ, తిరుమలశెట్టి శ్రీహరి, పోద వీరయ్య, నాయుడు హనుమంతరావు, తోటకూర వెంకట్రావు, నాగిశెట్టి బ్రహ్మయ్య, సుబ్బారావు, నరహరి శ్రీను, రాఘవయ్య, జయరావు, సందు శీను, చిరంజీవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.